# గంజాయి మొక్క

వింధ్యవాసిని




ప్రకాశ్ :

ఇటీవల బాగా వర్షాలు రావడంవల్ల చెరువు నిండుగా నీళ్ళున్నాయి. కట్ట మీదున్న విఘ్నేశ్వరుని ఆలయంలో పూజ చేసుకుని బయటికొచ్చాము నేనూ, స్వర్ణ. నీళ్ళకి దగ్గర్లో ఉన్న ఒక సిమెంటు బెంచీమీద కూర్చుని ప్రసాదం, శెనగ గుగ్గిళ్ళు తిన్నాము.

"ఈ పిసింద్రీలు ఇద్దరూ లేకుండా మనం ఇలా వచ్చి ఎన్నాళ్ళయిందో కదూ!" అన్నాను, చేతులు కర్చీఫ్‌కి తుడుచుకుంటూ.

"అదయినా వాళ్ళిపూట మా అక్కయ్య గారింటికి వెళ్ళబట్టిగానీ...."

"లేకపోతే నిన్నిలా వదులుతారా? అసలు వాడున్నాడే నీ కొడుకు, వాడికి చచ్చేంత భయం, నేను నిన్నెక్కడ కొరుక్కుతినేస్తానో అని."

"పోండి మీరు మరీని. చిన్నపిల్లాడు కదా!"

ఇద్దరం గట్టుమీద షికారుకి బయలు దేరాము. నీళ్ళమీదనుంచి వస్తున్న గాలి చల్లగా హాయిగొలుపుతూ ఉంది.

ఆవేళ ఆదివారం కాదు. అందుకే అంతగా జనం లేరు. చాలామట్టుకు, చెఱువుకట్టమీద నిర్మానుష్యంగా ఉంది.

అప్పటికి సూర్యాస్తమయం అయి కొంతసేపు అయివుంటుంది. చెఱువుకి అవతల అడ్డుగోడలా ఉన్న దేవరకొండ అంచుకి పైనుంచి తొంగిచూస్తున్న చందమామని చూస్తూ అడుగులు వేస్తున్నాము. నేను మెల్లగా స్వర్ణ చేతిని అందుకోబోయాను.

"ఇది బెంగుళూరు కాదు స్వామీ" అంటూ విడిపించుకుంది తను. మేం బెంగుళూర్నుంచి ఇక్కడికి మకాం మార్చి రెండేళ్ళే అయింది.

"మీ ఆడాళ్ళెప్పుడూ ఇంతే. ఎవరో చూడొస్తారని ఇద్దరం చేయిచేయి కలిపి నడిస్తే కలిగే ఆనందాన్ని కాలదన్నుకుంటారు" అన్నాను, చిరునవ్వుతో విచ్చుకున్న స్వర్ణ పెదిమలమధ్య తళుక్కుమన్న పలువరుసని గమనిస్తూ.

మా పెళ్ళయిన ఆరు సంవత్సరాల్లో స్వర్ణలో ఎలాంటి మార్పూ లేదు. పెళ్ళిచూపులనాడు ఎలా ఉందో, ఇప్పుడూ అలాగే కనిపిస్తుంది నా కళ్ళకి.

ఉదయం జరిగిన తమాషా సంఘటన ఒకటి గుర్తొచ్చి, "ఇవాళ మా ఆఫీసులో ఏమయిందో తెలుసా...." అని మొదలు పెట్టబోయిన నేను టక్కున ఆగిపోయాను.

స్వర్ణ అల్లంత దూరంలో ఏమిటో వేలుపెట్టి చూపుతోంది. మొదట నాకేమీ అర్థం కాలేదు. దట్టంగా అలుముకుంటున్న చీకట్లో కళ్ళు చికిలించి చూశాను.

చెరువుగట్టు అంచున ఒక మనిషి నిలుచుని ఉన్నాడు.

"అతను నీళ్ళలోకి దూకేసేలా ఉన్నాడు కదూ?" అన్నది స్వర్ణ భయంగా.

"వెయిట్" అంటూ గబగబా నాలుగు అంగల్లో అక్కడికి చేరుకున్నాను.

అక్కడ నిలుచుని ఉన్న వ్యక్తికి ఇదేమీ తెలిసినట్లు లేదు. బహుశా కళ్ళు మూసుకుని ఉన్నాడేమో అనిపించింది.

గభీమని చొక్కా పట్టుకుని లాగి, "ఏయ్ మిస్టర్! ఏమిటి నువ్ చేస్తున్నది?" అని గదమాయించాను.

అతనేం మాట్లాడకుండా ముఖానికి చేతులు కప్పుకుని, అక్కడున్న ఓ బెంచీమీద కూలబడిపోయాడు.

అప్పటికి అక్కడికి చేరుకున్న స్వర్ణ బ్యాటరీలైటు అందించింది. లైట్ ఆ మనిషి ముఖానికి ఫోకస్ చేశాను.

"ఎవరు.. ఎవరితను.. ఎక్కడో చూసిన ముఖంలా ఉంది." నాలో అనుమానం.

నా మెదడులో మెఱుపు మెరిసినట్లు

అయింది. "నువ్వు రాజా కదూ?" అన్నాను గొంతు పెగుల్చుకుని.

మాసిన పైజమా, లాల్చీ, తైల సంస్కారం లేని జుట్టు, బవిరి గడ్డంతో ఉన్న అతన్ని, ఎప్పుడో ఎన్నేళ్ళ క్రితమో దూరమయిన నా మిత్రుణ్ణి నేను గుర్తించ గలగటం గొప్ప విషయమే.

రాజా నా ముఖానికన్నా ముందు స్వరాన్ని గుర్తించాడు.

"ప్రకాశ్ నువ్వా!" అన్నాడు ఆశ్చర్యంగా.

రాజా పక్కనే కూలబడి, వాడి భుజంమీద చేయివేస్తూ, "ఏమిట్రా ఇది. అసలీ ఊరెప్పుడొచ్చావు నువ్వు. నేరుగా నా దగ్గరికెందుకు రాలేదు."

నా ప్రశ్నలు దేనికీ సమాధానాలు తెలియనివాడిలా మౌనంగా ఉన్నాడు రాజా. వాడి మనసులో ఉన్నదేమిటో నా ఊహకి అందటంలేదు.

"అసలీ ఆత్మహత్యా ప్రయత్నమేమిటి? నీకీ బుద్ధెలాపుట్టింది.సమయానికి ఇటురావటం మంచిదయింది... లేకపోతే.. " గుండెలమీద చేయి వేసుకున్నాను.

"నువ్వు రాకపోతే, ఈ భూమ్మీద బ్రతకాల్సిన అవసరంలేని ఒక మనిషికి ఆయువు తీరిపోయేది" నిర్లిప్తంగా అన్నాడు రాజా.

ఎలాంటివాడెలా అయిపోయాడు? కాలేజీలో చదువుకునే రోజుల్లో పూల రంగడిలా ఉండేవాడు. ఆ హుషారు, జోరు— అన్నీ ఏమయ్యాయి? ఎందుకిలా తయారయాడు? ఎన్నో సందేహాలు నా మనసులో. వాటన్నిటికీ, ఎదురుగా మునిలా కూర్చుని ఉన్న మిత్రుడు సమాధానాలు చెప్పేలా కనిపించలేదు. అలా ఎంతసేపున్నాడో, వెంట స్వర్ణ వచ్చిం దన్న విషయాన్ని కూడా మరిచి.

"ఏమండీ" అని భుజంతట్టి పిలుస్తోంది తను.

"పద రాజా వెళదాం. నా మాట కాదనకు. కమాన్, లే" అని వాడి చేయిపట్టి లేవదీసాను.

* * *

స్వర్ణని రిక్షా ఎక్కించి ఇంటికి పంపాను. రాజాని హేర్ డ్రస్సింగ్ సెలూన్‌కి తీసికెళ్ళాను.

మేం ఇంటికి వెళ్ళేసరికి వంటగదిలో నుంచి మసాలా వాసన లొస్తున్నాయి. బాత్‌రూంలో వేడినీళ్ళు రెడీగా ఉన్నాయి. స్వర్ణకి ఏదీ చెప్పనక్కర లేదు. తనంత తనే అన్నీ అర్థంచేసుకుని అమర్చేస్తుంది.

బీరువాలోంచి నావి ఒక జత దుస్తులు తీసి, టవలు, అవీ రాజాకి అందించి, వెళ్ళి స్నానం చెయ్యమన్నాను. వాడికలా నా దుస్తులు అందిస్తూఉంటే నా కళ్ళు చెమర్చాయి. ఒకప్పుడు చదువుకునే రోజుల్లో రెండు జతల్తో కాలం గడిపిన నేను వాడివెన్నిజతలో స్వంతానికి ఉపయోగించాను. ఆ రోజుల్లో మా ఇద్దరి

స్నేహాన్ని చూసి ఈర్ష్య పడినవారెందరో లెక్కే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్ళీ ఇన్నేళ్ళకి రాజానిలా కలుస్తానని ఎప్పుడూ అనుకోలేదు నేను.

స్వర్ణ ఏం చెస్తుందా అని లోపలికి వెళ్ళాను.

"అసలు ఇంటికీ ఇతనెవరు?" అని స్వర్ణ అడగనేలేదని అప్పుడు గుర్తొచ్చింది నాకు. రాజాని గురించి నేను తనకి ఎన్నోసార్లు చెప్పిఉంటాను. బహుశా అందువల్లే గ్రహించి ఉంటుందని అనుకున్నాను.

"మా వాడికి నాన్-వెజ్ ఇష్టమని నీకెలా తెలుసోయ్" అడిగాను.

"ఎప్పుడో మీరే చెప్పినట్లు గుర్తు."

"పోన్లే మంచిపని చేశావు. వాడసలు భోజనం చేసి ఎన్నాళ్ళయిందో అన్నట్లున్నాడు." అనుమానంగా అన్నాను.

అడుక్కు తినేవాడి అవతారంలో కనిపించిన రాజాని ఇలా నేరుగా ఇంటికి తీసుకొచ్చానని స్వర్ణ ఏమనుకుంటుందో అని నాలో కొద్దిగా భయం ఉంది. అందుకని మా ఇద్దరికీ మధ్యమన్న స్నేహం ఎంత గొప్పదో వివరించి చెప్పాలని అనిపించింది. కానీ నిజానికి నన్ను గురించి ఆమెకి తెలీని విషయాలు అంటూ ఏవీ లేవు. 'అర్ధాంగి' అన్న బిరుదును సార్థకం చేసుకుంటున్న ఇల్లాలు ఆమె.

రాజా స్నానం ముగించి బయటికొచ్చాడు.

"మా ఇద్దరికీ వడ్డిస్తావా?" అన్నాను.

ఎక్కువ మాటలు లేకుండానే ఇద్దరమూ భోంచేశాము.

ఆరుబయటవెన్నెల్లో కుర్చీలువేసాను. ఇద్దరం చార్మిని సిగిరెట్లు వెలిగించుకున్నాము.

"ఇప్పుడు చెప్పు భాయీ .. అసలు ఎందుకిలా అయావు? నీ మనసులో ఉన్న బాధ ఏమిటి? నాకు చెప్పు" అన్నాను.

* * *

రాజారాం :-

జీవితంలో అన్ని విధాలుగా ఓడిపోయినవాడికి, చివరికి మంచితనాన్ని, అభిమానాన్ని భరించే శక్తికూడా ఉండదేమో!

నేను బ్రతికటంవల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదని నేను తెలుసుకుని, ప్రాణాలు తీసుకోబోతే, అడ్డుపడి వెనక్కు లాగేడు ప్రకాశ్. ఈ భూమ్మీద ఇంకా ఇంత మంచి మనుషులున్నారా అన్న నా అనుమానం తప్పని ఋజువు చేశాడు. ఎప్పుడో తనకు నేను చేసిన అవగింజంత సహాయానికి, ఇప్పుడు బ్రహ్మాండమంత చేసి ఋణం తీర్చుకుంటున్నాడు.

వారంరోజులుగా పస్తులున్నవాడికి కడుపునిండా భోజనం పెట్టి, కాల్చుకుం

దుకు సిగిరెట్టిచ్చి నా కథ చెప్పమన్నాడు ప్రకాశ్.

ఏం చెప్పను? ఎలా మొదలుపెట్టను. నా బ్రతుకే ఒక వెఱ్ఱివాడు వ్రాసిన కథలా అయింది.

కళ్ళు మూసుకుంటే చాలు ఒక్కొక్క సంఘటనా తెరలు మారుతున్నట్లు గుర్తొస్తున్నాయి.

క్రమపద్ధతిలో ఆలోచించలేని వయసులో చేతుల్లో పుష్కలంగా డబ్బున్న ఏ యువకుడయినా నడిచే మార్గాన్నే నేనూ నడిచాను.

జమీందారీ ఫాయలో మాత్రమే ఆలోచించే నాన్నగారు నేను చేస్తున్నది తప్పని నా కెప్పుడూ చెప్పలేదు. హైస్కూలు చదివే రోజులనించీ నా వెంటే ఉండే ప్రకాశ్ ఎన్నిసార్లు నాకు 'ఇది పద్ధతి కాదు' అని చెప్పబోయినా నేను చెవినివేసుకున్నదీ లేదు.

అప్పట్లో నా అందం, యవ్వనం, ధనం లాంటి ఆకర్షణలని ఉపయోగించి అమ్మాయిలని నా చుట్టూ తిప్పుకోవటం నాకు చాలా ఇష్టమయిన హాబీ. మా ఊర్లో కొత్తగా దొరికే ఏ బ్రాండ్ లిక్కర్ అయినా ముందుగా కొనేసి రుచి చూడటం, కొత్తగా వచ్చిన సినిమా మొదటి షోనే చూసెయ్యటం నా సరదా. కనీసం నలుగురయినా స్నేహితులు లేకుండా ఒంటరిగా తిరగటం ఎప్పుడూ లేదు.

సంవత్సరమంతా కలిసి నెలరోజులయినా కాలేజీకి వెళ్ళని నేను బియ్యే పరీక్ష ఎలా గట్టెక్కించానో అని నాకే ఆశ్చర్యంగా ఉంటుంది.

కానీ అప్పట్లో సరదాలు అనుకున్న నా అలవాట్లే చివరికి నాకు ఎదురుదెబ్బ తీస్తాయని ఊహించలేకపోయాను.

నా వెంట తిరిగిన అమ్మాయిలకీ, మత్తులోపడి హద్దులు మరిచి నాతో స్నేహంచేసిన కాలేజీ మెట్లకీ కొదవ లేదు.

కానీ ఎందుకో ఒక్కసారి 'స్వర్ణ'ని చూడగానే నా మనసు చలించింది.

"ఈ ప్రపంచంలో బొత్తిగా తెలివి లేనివాళ్ళు మాత్రమే పెళ్ళిచేసుకుంటారు" అన్న ఉద్దేశ్యంతో అన్నాళ్ళూ ఉన్న నేను 'స్వర్ణ'ని చూసినప్పుడు మొదటిసారిగా పెళ్ళిగురించి ఆలోచించాను.

ఒక మామూలు కాలేజీ లెక్చరర్ కూతురు స్వర్ణని నా అంతటివాడు కోరటమే తరువాయిగా వాళ్ళు ఎగిరి గంతేసి ఒప్పుకుంటారనుకున్నాను.

కానీ అక్కడే పొరపాటు జరిగిపోయింది. స్వర్ణ నన్ను పెళ్ళిచేసుకునేందుకు అంగీకరించలేదు.... అంతే కాదు ... ఇంకా నన్ను, నా అలవాట్లని నిరసిస్తూ, ఎన్నో మాటలు అన్నదని— ఆ మాటలు అన్నీ నా చెవిని చేరాయి. అవమానం భరించలేక ఊరు విడిని వెళ్ళిపోయాను.

తర్వాత రెండేళ్ళకి తెలిసింది ప్రకాశ్‌కీ స్వర్ణకీ పెళ్ళయిందని. వాడికి నా గొడవలేవీ తెలీవు. ఎలాగో నా అడ్రస్ కనుక్కొని పెళ్ళిపత్రిక పంపించాడు. పెళ్ళికి రాలేకపోతే, బెంగుళూర్లో తను పనిచేసే ఆఫీస్ అడ్రస్ ఇచ్చి తమ క్వార్టర్స్‌కి అయినా రమ్మని ఉత్తరం రాశాడు. స్వర్ణ ముఖం చూడటం ఇష్టం లేకే నేను ప్రకాశ్ పెళ్ళికి వెళ్ళలేదు.

మా నాన్నగారు పోయినప్పుడు ఊరెళ్ళి ఆస్తంతా అమ్ముకుని వచ్చి హైదరాబాదులో మకాం పెట్టేశాను పర్మినెంటుగా. ఊరికే ఊళ్ళు తిరగడం మానేసి కుదురుగా ఏదయినా వ్యాపారం చేద్దామనుకుంటున్నాను.

చేతినిండాగా డబ్బు ఉండాలనేగానీ, స్నేహితులకీ, సలహాదార్లకీ లోటు ఏముంది? నలుగురూ నాలుగు విధాల సలహాలు, పద్ధతులు చెప్పారు.

బాగా పేరున్న ఒక కాస్మెటిక్స్ కంపెనీవారి ఏజన్సీ తీసుకున్నాను. వ్యాపారం ప్రారంభించిన తర్వాత, నాన్నగారు కోరినప్పుడల్లా డబ్బు పంపుతూఉంటే కేర్‌ఫ్రీగా తిరిగిన నాకు, కాళ్ళు కట్టేసినట్టయ్యింది. ఆరు నెలలు అయేసరికి బోర్ కొట్టేసింది.

ఇక లాభం లేదనుకుని, ఇలాంటి వ్యాపారాల్లో బాగా అనుభవం ఉన్న రామబ్రహ్మాన్ని మేనేజరుగా తీసుకుని, అంతా అతనికి అప్పజెప్పాను.

కావలసినంత విశ్రాంతి, తీరుబాటు. పగలంతా నిదురపోవటం, రాత్రులు క్లబ్బు, షికార్లు, కేబరేలు, అందమయిన అమ్మాయిల కంపెనీల్లో గడపడం మళ్ళీ మొదలయింది.

ఒకరిద్దరు పెద్దమనుషులు వాళ్ళ అమ్మాయిలని నాకిచ్చి వివాహం చేయాలనే ఉత్సాహం చూపకపోలేదు. కానీ నాకే స్వర్ణ కాదన్న తర్వాత, ఎందుకో ఇంకెవర్నీ చేసుకోవాలని అనిపించలేదు. 'అసలు పెళ్ళి చేసుకోకపోతేనేం?' అన్న మొండితనం వచ్చేసింది.

రెండేళ్ళు వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగింది. తర్వాత మొదలయాయి కష్టాలు, చిన్న చిన్న ఎదురుదెబ్బలు. కానీ పూర్తిగా మునిగిపోయేదాకా, అసలు కారణం ముసలినక్క రామబ్రహ్మమే అని తెలుసుకోలేకపోవటం నా తెలివిలేని తనమే!

రీటెయిలర్స్ దగ్గిర సమయానికి వసూలు అవలేదని, మూడుసార్లు పెద్ద మొత్తాల్లో అప్పులు తెచ్చి, కంపెనీవారు పంపిన సరుకు విడిపించుకోవలసి వచ్చింది.

సరిగ్గా అప్పుడే రేసుల్లో బాగా డబ్బు వస్తుందని ఒక మిత్రుడిద్వారా తెలిసింది. అతని వెంట బెంగుళూరు వెళ్ళాను. రేసింగ్ సీజను ముగిసేసరికి జేబులు ఖాళీఅయి తిరిగివచ్చాను. తమాషా ఏమి

టంటే రెండుసార్లు ఇరవయి వేలు గెలుచుకున్నా చివరికి ఏమీ మిగల్లేదు.

హైదరాబాదు చేరుకునేసరికి పరిస్థితి తలక్రిందులు అయింది. బ్యాంకులో కట్టాల్సిన రెండు ఇన్‌స్టాల్‌మెంట్ల సొమ్ము తీసుకుని పరారీఅయాడు రామబ్రహ్మం. అతిణ్ణి పట్టుకున్నా, కేసులు బనాయించగల ఆధారాలేమీ నా దగ్గర లేవు. బాంకువాళ్ళు నా గోడవున్లు అన్నీ లాక్‌చేశారు. ఆ మనిషిని నమ్మి అంతా అతనికి వదిలేసిన నా మూర్ఖత్వానికి ప్రతిఫలం ఇది.

మూడో కంటికి తెలీకుండా, నేనుంటున్న ఇల్లు అమ్మి వచ్చినంత డబ్బు తీసుకుని బెంగుళూరు వెళ్ళాను.

కనీసం నా దగ్గిరున్న మొత్తంతో అయినా మరొక చిన్న వ్యాపారం పెట్టి శ్రద్ధగా చేసుకోవాలని ఉంది. కానీ ఏం చేయాలా అన్న ఆలోచనల్లోనే రోజులు గడిచిపొయ్యాయి. నా అలవాట్లు మెల్లిగా దగ్గిరున్న డబ్బుని తినేస్తున్నాయి.

'అసలు బ్రతుకే అంతా దురదృష్టమయం' అన్న నిరాశ ప్రవేశించింది నా మనసులో. ఈ నిరాశనీ బాధనీ మరిచిపోయేందుకు ఒళ్ళుతెలియకుండా తాగేవాణ్ణి. ఇరవయి నాలుగ్గంటలూ మత్తులోపడి ఉండేవాణ్ణి.

'అసలెందుకు బ్రతకాలి? ఎవరి నుద్ధరించాలని? ఉన్నదంతా ఖర్చయే వరకూ ఏదీ ఆలోచించను. అటు తర్వాత ఈ లోకంనుంచే దూరంగా వెళ్ళిపోతాను' అని నిర్ణయించుకున్నాను,

ఎందుకో ఒకసారి అనంతపూర్ వెళ్ళాలనిపించింది. అక్కడ నాకు తెలిసినవారు అంటూ ఇప్పుడు ఎవరూ ఉండకపోవచ్చును. అయినా ఏమిటో పిచ్చిగా బయలుదేరాను. చెఱువు నిండుగా నీళ్ళు చూస్తే ఆత్మహత్యకి మార్గం తెలిసింది.

సరిగ్గా అప్పుడే ప్రకాశ్ వచ్చి అడ్డు పెట్టకపోతే ఇప్పటికి శాశ్వత శాంతి దొరికేది అనిపిస్తుంది. కానీ చిత్రంగా నా కెందుకో వాడిమీద కోపం రాలేదు. ఒకప్పుడు నేను పెళ్ళాడాలనుకున్న స్వర్ణ వాడిపక్కన కనిపించినా నాకేమీ అనిపించలేదు. అన్నిటికీ అతీతంగా ఉంది నా మనఃస్థితి.

ప్రకాశ్ నామీద చూపుతున్న అభిమానాన్ని భరించడం కష్టంగా ఉంది. నా కథ ఏమిటో చెప్పమన్నాడు. చెప్పగలిగినంత, చెప్పవలసినంత మాత్రమే చెప్పాను.

"నువ్వొట్టి పూల్‌వి. ఇప్పుడేమయిందని ప్రాణాలు తీసుకునే ప్రయత్నానికి వెళ్ళావు?"

• • •

స్వర్ణ

పాపం నాకేమీ తెలీదనుకుని స్నేహితుణ్ణి గూర్చి ఎంతో చెప్పుకొచ్చారు ప్రకాశ్. ఈ రాజారాం చరిత్ర అంతా నాకు తెలుసు. అలాంటి అచ్చోసిన



అబోతులకి చివరికి ఏ గతిపడుతుందో అ దశకే వచ్చాడు అతనిప్పుడు.

అతను ప్రకాశ్‌కి ప్రాణస్నేహితుడు- నిజమే! కానీ రెండురోజులుంచుకుని, అతని దారిని అతన్ని పంపించేయకుండా పర్మనెంటుగా ఇంట్లోనే ఉంచుకోవటం, నామట్టుకు దారేపోయే దారిద్ర్యాన్ని ఇంట్లో చేర్చుకున్నట్లుగా ఉంది.

మా పెళ్ళిఅయిన ఇన్నేళ్ళలో ఆయన నా ఇష్టం తెలుసుకోకుండా చేసిన పని ఇదొక్కటే. అందుకే ఏదయినా చెబుదామన్నా ఆయన బాధపడతారేమోనని మానేసాను.

రాజారాం మారిపోయాడనీ, మళ్ళీ మామూలు మనుషుల్లో పడతాడనీ ఏమిటో ఈయనకి పిచ్చి నమ్మకం. చెడిపోవటంలోనూ అంత హీనస్థితికి దిగజారిన అతన్ని చూస్తే నాకేమిటో అనుమానంగానే ఉంది. కానీ ప్రకాశ్ నమ్మకాన్ని నేనెందుకు కాదనాలి అని మౌనం వహించాను. ఆయన చెప్పినట్లు చేశాను. ఆయనకి సంతృప్తి కలిగేలా నడుచుకున్నాను.

రాజారాం మా ఇంటికొచ్చి మూడు నెలలు దాటింది. ఈ మూడు నెలల్లో నేను అతనికి ఎదురుపడకుండా, మాట్లాడే అవసరం రాకుండా జాగ్రత్తపడ్డాను.

పిల్లలు అతని దగ్గర బాగా మాలిమి అయారు. బాగా సినిమాలకీ, షికార్లకీ తిప్పేవాడు. అప్పుడప్పుడు ప్రకాశ్ అతనికి పాకెట్ మనీ ఇవ్వటం తెలుసు. చూసీచూడనట్లు ఉండిపోయాను. నాకు మనసులో ఏమూలో నమ్మకంగా ఉంది, రాజారాం పాతరంగు మళ్ళీ బయటికొస్తుందనీ, అది ప్రకాశ్ కళ్ళలో పడి తీరుతుందనీ.

రెండుసార్లు ప్రకాశ్ షర్టుజేబులోంచి డబ్బులు మాయం అయాయి. ఆయన తనే ఎక్కడో బజార్లో పోగొట్టుకున్నానని అనుకున్నారు. కానీ నిజమేమిటో నాకు తెలుసు. డబ్బుపోయిన ప్రతీసారీ, రాజారాం తప్పతాగి ఇల్లు చేరటం నాకు

మాత్రమే తెలుసు. ఇదిలా ఎంత దూరం వెళుతుందో నన్న భయం ఉన్నా, నేను పెదవి కదిపి ఒక్క మాటయినా ప్రకాశ్‌తో చెప్పలేదు.

ఒకసారి నేను స్నానంచేసి ఇవతలికొచ్చి చీర కట్టుకుంటూ ఉండగా దగ్గరగా వేసిఉన్న బయటి తలుపుల్ని తోసుకుని, నేరుగా లోపలికి వచ్చేశాడు రాజారాం. అతను కావాలని అలాచేశాడో, లేక కాకతాళీయమో నాకు తెలీదు. కానీ ఆ వేళనించీ అతని చూపుల్లో మార్పు రావటం కనిపెట్టాను. అప్పుడప్పుడు నన్ను పలకరించాలని ప్రయత్నం చేసేవాడు.

చివరికి నేను అనుకున్న రోజు రానే వచ్చింది.

ఆవేళ ప్రకాశ్ ఊళ్ళో లేరు. ఉదయమే క్యాంపు వెళ్ళారు. సాయంత్రం పిల్లల్ని బయటికి తీసుకెళ్ళిన రాజారాం, చీకటిపడుతుండగా వాళ్ళని ఇంటిదగ్గర దిగబెట్టి, మళ్ళీ ఎటో వెళ్ళిపోయాడు.

అతను మళ్ళీ ఇల్లు చేరేసరికి రాత్రి పదకొండు గంటలు అయిఉంటుంది. తలుపు తీయగానే తెలిసిపోయింది, బాగా తాగి ఉన్నాడని. ముందు గదిలో టేబిల్‌మీద భోజనం ఉంచి నేను తలుపు మూసుకొని పడుకున్నాను.

అవతల అతనేదో అర్థంపర్థం లేకుండా వాగటం, గొణగటం తెలుస్తూనే ఉంది. ప్రకాశ్ లేడని తెలిసీ మోతాదుని మించి పట్టించినట్లున్నాడు మహానుభావుడు.

నాకు కొద్దిగా కునుకుపట్టిందో లేదో, గట్టిగా తలుపులు బాదటం వినిపించి మెలకువ వచ్చింది.

"ఏం కావాలి?" అడిగాను గట్టిగానే.

"తలుపు తియ్యి."

"ఎందుకు?"

"మంచినీళ్ళు కావాలి"

నా కేమిటో అనుమానమే. అయినా, ఎన్నాళ్ళీ ముసుగులో గుద్దులాట, ఇవాళ తేలిపోవాలి అటో ఇటో అనుకుని తెగించి, ధైర్యంగా తలుపులు తీశాను.

అమాంతం జంతువులా మీదపడబోతున్న రాజారాంని ఎదుర్కోవటానికి నేను సిద్ధంగానే ఉన్నాను.

సర్వశక్తుంతా ఉపయోగించి బలంగా ఒక్క తోపు తోశాను. అంతదూరాన వెళ్ళి పడ్డాడు రాజారాం. తల తిరిగినవాడిలా చూస్తూ, మంచంకోడుకి కొట్టుకున్న తలని ఒత్తి రాసుకుంటూ కూర్చున్నాడు.

"ఛీ ఏం మనిషి! పశువుకన్నా హీనం! అసలు స్నేహం, కృతజ్ఞత అన్న పదాలకి అర్థం తెలుసా?" ఈ నాలుగు మాటలే నేను అన్నది. తలుపులు బిడాయించుకుని మళ్ళీ పడుకున్నాను.

కలతనిద్రలో ఎప్పుడు రాత్రి గడిచి తెల్లవారిందో "స్వర్ణా" అని పిలుస్తున్న ప్రకాశ్ స్వరం గుర్తించి, గబగబా లేచి వెళ్ళాను. ముందు గదిలో రాజారాం

మంచం ఖాళీగా ఉండటం నేనూ, ఆయనా ఒక్కసారి చూశాం. పక్కనే స్టూలు మీద నీళ్ళచెంబు కిందనించీ కనిపిస్తున్న చీటీ అందుకున్నారు ప్రకాశ్.

ఇద్దరమూ కలిసి చదివాం.

“మిత్రమా!

మీ ఇల్లొక తులసివనం. ఇందులో గంజాయి మొక్కలాంటి నేను ఉండటం శ్రేయస్కరం కాదు. అందుకే వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఆత్మహత్య పాల్పడతాననే భయం వద్దు. నాలో జీవించాలనే ఆశకి ప్రాణంపోసింది నువ్వే. నా మనసుకి శాంతినీ, ప్రలోభాలకి లొంగిపోని శక్తినీ ప్రసాదించగల చోటు కోసం వెతుక్కుంటూ పోతున్నాను.

గుడ్‌బై, రాజారాం” అని ఉంది.

అది చదివి అయోమయంగా చూస్తున్న ప్రకాశ్ భుజంమీద చేయివేసి, “రండి, కాఫీ తీసుకుందాం” అని లోపలికి తీసుకెళ్ళాను.

— —

